క్లుప్తంగా

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలను మాడవీధుల్లో ఊరేగిస్తున్న వేద పండితులు, టీటీడీ సిబ్బంది

కార్వేటినగరం: టీటీడీ అనుసంధానంగా ఉంటున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో వేదపండితులు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గడ్డ కర్పూరం, కిచ్చిలి ఆకు, చందనం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలను కలిపి వేద మంత్రాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ గర్భగుడిలో గోడలను సుగంధ ద్రవ్యాలను పూసి శుద్ధి చేశారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు సురేష్‌కుమార్, అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి, పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మునివేలు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంపీపీ సమాధానం చెబుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించా లని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్, వైస్ ఎంపీపీలు కె.మునస్వామిరెడ్డి, విమల, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన చారుమతి జ్ఞాపకార్థం ధనుంజయులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారంలోనే కాకుండా దాతలకు అవకాశం ఉంటే రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత ధనుంజయులు, కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు



వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అంతకుముందు ఆలయ ఆవరణలో ఉన్న వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

కల్పవల్లీ.. కరుణించు గంగమ్మ తల్లీ

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో గ్రామ దేవత గంగజాతరను ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. దీంతో గ్రామాల్లో జాతర శోభ సంతరించుకుంది.

- నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో గంగ జాతర
- అమ్మవారికి పొంగళ్లు సమర్పణ
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



పాలసముద్రం : వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించిన అమ్మవారు



పెనుమురు(కార్వేటినగరం) : ముత్యగంగమ్మకు పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు



పాలసముద్రం : గెరిగెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

పెనుమురు(కార్వేటినగరం) : మండల పరిధిలోని ఉగ్రాణపల్లి గ్రామ దేవతగా వెలసిన శ్రీ ముత్యగంగమ్మ జాతరను మంగళవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి అంబలి పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. ఇందులో భాగంగా సర్పంచ్ మురళీకుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలని, స్థానిక ఎమ్మెల్యేగా కృపాలక్ష్మి గెలవాలని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు పురవీధుల్లో జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. కార్యక్రమంలో గుణశేఖర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కనకరాజులురెడ్డి, రాజశేఖర్ రెడ్డి, హరినాథరెడ్డి, జగపతిరెడ్డి, రాజేష్‌రెడ్డి, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

చెవుటి గంగమ్మకు పూజలు

పాలసముద్రం : మండలంలోని కేజే పురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ కొలుపు మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం అమ్మవారికి వివిధ అభిషేక, పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. మధ్యాహ్నం గెరిగెను గ్రామాల్లో మంగళ వాయిద్యాల నడుమ, మహిళలు పసుపు నీరు చల్లకుంటూ నృత్యాలు చేస్తూ అమ్మవారి ఆలయానికి చేర్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని భక్తులు తీసుకొచ్చిన వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి వేద పండితులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు



అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారిని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం: వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వ్యాపించే విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల వ్యాప్తి చెందే పలు విషజ్వరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీధుల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కావడం వల్ల డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రోజుల తరబడి జ్వరం, నీరసంతో బాధపడుతున్న వారు వెంటనే ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను 60 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 18–59 ఏళ్లలోపు వారు దీర్ఘకాలిక (డయాబెటిక్) వంటి వ్యాధులతో బాధ పడుతున్న వారికి తప్పనిసరిగా అవగాహన కల్పించి వారు వ్యాక్సిన్ వేసుకునే విధంగా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. అనంతరం సీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. రాత్రి సమయంలో డాక్టర్ విధుల్లో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ ఆనందమూర్తి, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ కీర్తి, హెల్త్‌అసిస్టెంట్ అంబరీష్‌రాజు, హిదయతుల్లా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర



అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం విరాటపురం రోడ్డులో వెలసిన తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తరువాత అమ్మవారికి అభిషేకాలు చేశారు. సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పుష్పపల్లకిపై వేంచేపు చేసి ఊరేగించారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి మంగళ హారతులు, కర్పూర హారతులు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో అమ్మవారికి అంబలి పోసి ప్రత్యేక పూజలు చేశారు.

రాజీవ్ గాంధీకి నివాళి



నగరి : శ్రీ పెరంబుదూర్‌లో రాజీవ్ గాంధీ సమాధికి నివాళ్లు అర్పిస్తున్న నగరి కాంగ్రెస్ పార్టీ నాయకులు



కార్వేటినగరం: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగరి : పట్టణ పరిధిలోని బస్టాండ్ ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. నగరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. అనంతరం తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్ వెళ్లి అక్కడ రాజీవ్ గాంధీ గారి సమాధికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఐటీ రంగంలో భారతదేశం దూసుకుపోతోందంటే నాడు ప్రధానిగా రాజీవ్ గాంధీ చూపిన చొరవే అన్నారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ బాబు, పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, సుధాకర్ రాజు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఢిల్లీ, డీసీసీ జనరల్ సెక్రెటరీ దేశయ్య, చిరంజీవిరెడ్డి, మున్సిపల్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ దేశప్పన్, నగరి రూరల్ మండల పార్టీ ప్రెసిడెంట్ కుమార్, నిండ్ర మండల పార్టీ ప్రెసిడెంట్ గిరి, నాయకులు రత్నం, అజిత్, మహమ్మద్ నబీ, మహేష్, గుణ, విజయ్, సతీష్, వెంకటేష్, ప్రభాకర్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

కార్వేటినగరం: దివంగత నేత భారత ,దేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధాశ్రమంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానంతో పాటు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ అధికారి ప్రతినిధి మాట్లాడుతూ భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. దేశ ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం ఇందిరాగాంధీ కుటుంబమని కొనియాడారు. ఈ క్రమంలో భాగంగా వృద్ధులను అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దినకర్, మాజీ సేవాదళ్ అధ్యక్షుడు గౌతమ్, సీనియర్ నాయకులు ఉమాపతిరెడ్డి, తారాసింగ్, తోతు, షరీఫ్, రుద్ర, పురుషోత్తంరాజు, రాజేశ్వరమ్మ పలు వురు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెద్దశేష వాహనంపై ఉభయ నాంచారులతో కల్యాణ వేంకటేశ్వరస్వామి విహారం

నారాయణవనం: టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యా యి. తొలిరోజు పెద్ద శేష వాహనంపై పరమపదనాథునిగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, కోలాట నృత్యాలు, అశేష భక్తులు గోవింద నామస్మరణల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. వేకువజామున 4.30 గంటలకు ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఆలయ మాడవీధుల్లో విష్వక్సేన, చక్రతాళ్వార్, కొడిపార్వ్య వస్త్రంతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు అనంతరం ఆలయంలో ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింప చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీవీరరాఘవ దేవస్థానం నుంచి పట్టుసాలె కులస్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు ఉభయ నాంచారుల సంయుక్తంగా శ్రీస్వామివారు ఊంజల్‌సేవలో పాల్గొన్నారు.





పుత్తూరులో పండ్లు, పట్టు పీతాంబరాలతో ముస్తాబైన గంగమ్మ, వేషాలు వేసి, అంబలి తాగుతున్న పిల్లలు

పిడికిలి గంగమ్మకు పూజలు

పుత్తూరు: తిరుపతి గంగ జాతరను పురస్కరించుకుని స్థానిక బజారువీధిలోని పిడికిలి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పండ్లతో అలకరించారు. అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అంబలి పోశారు. చిన్న పిల్లలు, పెద్దలు సైతం వేషాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి జాతరను తమ గ్రామ జాతరగా భావిస్తూ పుత్తూరు ప్రజలు గంగమ్మను కొలవడం ఆనవాయితీగా వస్తోంది. తిరుపతికి సైతం పెద్దసంఖ్యలో భక్తులు తరలివెళ్లి అక్కడి గంగమ్మను దర్శించుకున్నారు.



గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

భవిత పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు: పట్టణంలోని భవిత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను చేర్పించడానికి వారి పేర్లను నమోదు చేయించాలని ఎంఈఓ తిరుమలరాజు కోరారు. మంగళవారం స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయంలో విద్యా శాఖకు చెందిన ఐఈఆర్‌టీ, సీఆర్‌ఎంటీ, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి, పిల్లల పేర్లను నమోదు చేయించాలని సూచించారు. పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించడం ద్వారా స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, చిన్న వయసులోనే వికలత్వాన్ని గుర్తించి తగిన కృత్యాలను, రోజువారి కార్యక్రమాలను పిల్లలకు నేర్పించడం జరుగుతుందని వివరించారు. ఈ విషయాలను సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ వర్కర్లు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సైతం తల్లిదండ్రులకు తెలియజేసి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చేర్పించాలని స్పష్టం చేశారు. గుర్తించిన పిల్లల తల్లిదండ్రుల వివరాలను భవిత ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యకుమారి 99853 70221, 86862 58910 నంబర్లను ఫోన్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు.

కంచి గరుడసేవ ఉత్సవ ఏర్పాట్లు



ఆలయాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ నాగరత్నం

నగరి : పట్టణ పరిధిలో వెలసిన శ్రీ కరియా మాణిక్య స్వామి ఆలయంలో కంచి గరుడసేవ ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీ గురువారం జరిగే కంచి గరుడసేవ ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్నం మంగళవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో చర్చించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 6:30 స్వామివారి ఉత్సవమూర్తి బయలు దేరుతుందని తెలిపారు. ఆయన వెంట ఆలయాల ఏఈఓ పార్థసారథి సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి అభిషేకం

వేడుకగా తిరుపతి జాతర

నిత్యం భక్తి పారవశ్యంతో తిరుపతి పట్టణం మంగళవారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర ఈనెల 14వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైంది. వారం రోజుల పాటు అత్యంత కోలాహలంగా సాగిన జాతర ముగింపు దశకు చేరుకుంది. దీంతో భక్తులు అమ్మలుగన్న అమ్మ.. మూలపుటమ్మ.. గంగమ్మ అంటూ మొక్కులు తీర్చుకున్నారు. భారీగా జంతుబలులు సమర్పించారు. ఆలయ అధికారులు, పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

- తిరుపతి కల్చరల్



కర్పూర జ్యోతులు వెలిగించి మొక్కుతున్న ఎమ్మెల్యే భూమన



అమ్మవారి కొడిస్తంభం వద్ద మొక్కుతున్న భక్తులు



మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడాచైర్మన్ మోహిత్‌రెడ్డి